# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## పాలిటిక్స్ లో వ్యూహాలకు.. ప్రాక్టికల్స్ కు... తేడా పీకేకు తెలిసిందా?

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా పేరు సంపాదించుకున్న ప్రశాంత్ కిశోర్... ప్రధానంగా ఏపీలో 2019లో వైసీపీ అధికారంలోకి రావడంలో కీలక భూమిక పోషించినట్లు చెబుతుంటారు. అంతక ముందు బీజేపీకి సహకరించారని అంటారు. ఆ విధంగా వ్యూహకర్తగా పీకే సక్సెస్ అయ్యారనే అంటారు. ఈ సమయంలో ఆయన నేరుగా పొలిటీషియన్ గా మారారు. ఇందులో భాగంగా... జన్ సురాజ్ పార్టీని స్థాపించారు. ఇటీవల బీహార్ లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసినా.. చూపించిన ప్రభావం అతి స్వల్పం అనే మాటలు వినిపించాయి. ఇలా పొలిటికల్ ప్రాక్టికల్స్ లో దక్కా మొక్కీలు తింటున్నట్లు కనిపిస్తున్న పీకే తాజాగా పోలీసుల అరెస్టు, వివరం చెప్పకుండా వివిధ ప్రాంతాలకు తిప్పడం వంటి విషయాలను ఎక్స్ పీరియన్స్ చేసినట్లు తెలుస్తోంది. అవును... బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీ.పీ.ఎస్.సీ.) వ్యవహారంలో ప్రశాంత్ కిశోర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు సోమవారం భగ్నం చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ఈ సమయంలో ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తూ కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. అయితే... ఈ షరతులతో కూడిన బెయిల్ ను పీకే తిరస్కరించారు. దీంతో.. ఆయనను సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో కోర్టు ఈసారి షరతులు లేని బెయిల్ మంజూరు చేసింది. దీంతో.. సోమవారం రాత్రి జైలు నుంచి విడుదలయ్యారు ప్రశాంత్ కిశోర్. ఈ సందర్భంగా స్పందించిన ప్రశాంత్ కిశోర్... పోలీసులపై సంచలన ఆరోపణలు చేశారు. ఇందులో భాగంగా... తన దీక్షను భగ్నం చేసిన అనంతరం తనను ఎక్కడికి తీసుకెళ్తున్నారనే విషయం చెప్పలేదని.. ఈ క్రమంలో ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకూ వివిధ ప్రాంతాలకు పోలీసు వాహనంలో కూర్చోబెట్టి తీసుకెళ్లారని అన్నారు. ఇదే సమయంలో.. తనను జైలుకు కూడా తీసుకెళ్లలేదని పీకే సంచలన ఆరోపణలు చేశారు. దీంతో... ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగిన తర్వాత, ప్రధానంగా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎదురయ్యే బాధలు, ఇబ్బందులు వాటి నుంచి ఎలా తేరుకుని ప్రజల్లో పేరు సంపాదించుకోవాలి అనే విషయాలపై ఇప్పటివరకూ పలువురు నేతలకు మెలుకువలు చెప్పిన పికేకీ.. తాజాగా ఈ ప్రాక్టికల్ ఎక్స్ పీరియన్స్ కూడా లభించినట్లుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. కాగా... ఇటీవల బీ.పీ.ఎస్.సీ నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో.. ఈ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 2న గాంధీ మైదానంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు ప్రశాంత్ కిశోర్. దీంతో... సోమవారం ఆయన దీక్ష భగ్నం చేశారు పోలీసులు. ఈ క్రమంలో... సుమారు నాలుగు రోజుల పాటు నిరాహర దీక్ష చేయడంతో పాటు సోమవారం పగలంతా పోలీసుల అదుపులోనే ఉండటంతో ఆయన ఆరోగ్యం క్షీణించిందని చెబుతున్నారు. దీంతో.. ఆయనను పాట్నాలోని ఆస్పత్రికి తరలించారని తెలుస్తోంది.

## కళ్యాణ లక్ష్మిషాదీ ముబారక్ చెక్కులను పంపిణి చేసిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సాబేరా బేగం



**గంభీరావుపేట (ఎల్లారెడ్డి పేట)జనవరి 8(ప్రభాత సమాచారం):** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను బుధవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ షేక్ సాబేర బేగం తహాసిల్దార్ రామచంద్రం తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలానికి 1 కోటి 41 లక్షల రూపాయల చెక్కులను అందజేసి మొదటి స్థానంలో నిలవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి చేస్తూనే మరోవైపు సంక్షేమ పథకాలు అమలుపరుస్తున్నారని అన్నారు. రైతులకు రుణమాఫీ తో పాటు సన్నవడ్లకు 500/- బోనస్ ను కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అంతే కాకుండా జనవరి 26 నుండి రైతు భరోసాను సంవత్సరానికి 12000/- వేస్తూ భూమిలేని నిరుపేద కుటుంబాలకు కూడా సంవత్సరానికి 12 వేల రూపాయలు వేస్తామని అన్నారు దీనిని ఇందిరమ్మ భరోసాగా పిలవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాట రామ్ రెడ్డి,సస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి, పి ఎస్ ఎస్ సి చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, తిమ్మాపూర్ పిఎస్ఎస్సి వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, డైరెక్టర్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, నాయకులు షేక్ సాహెబ్, షేక్ గౌస్, శ్రీనివాసరెడ్డి, గంట బుచ్చగౌడ్, చెన్ని బాబు, బండారి బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు గ్రామాల వారీగా ఎల్లారెడ్డిపేట 13. వెంకటాపూర్ 12 రాచర్ల తిమ్మాపూర్ 15 సింగారం 2 రాజన్నపేట 7 పోతిరెడ్డిపల్లి 2 పధిర 6 నారాయణపూర్ 13 కోరుట్ల పేట 5 రాచర్ల గుండారం 6 రాచర్ల గొల్లపల్లి 20 దుమాల 5 రాచర్ల బొప్పాపూర్ 16 బండలింగంపల్లి 8. అల్మాస్పూర్ 9 అక్కపల్లి 2 చెక్కులను పంపిణీ చేయనున్నారని అన్నారు మండలంలో 141 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను అందించామన్నారు తెలిపారు.



## ఉర్సు ఉత్సావాలకు ముస్తాబవుతున్న ముస్తఫా నగర్

**గంభీరావుపేట జనవరి 8(ప్రభాత సమాచారం):** గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామంలో ఉన్న దర్గా హజ్రత సయ్యద్ మీరాషా ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సావాలు ఈ నెల 11, 12 వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు దర్గా ముతవల్లి అబ్దుల్ రహీం తెలిపారు. 11 వ తేదీన గంధం ఊరేగింపు ఉంటదని 12 వ తేదీన ఉర్సు అన్నదాన కార్యక్రమం ఉంటదని ఈ ఉర్సు ఉత్సావాలకు భక్తులు రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి సిద్ధిపేట,కరీంనగర్ మరియు హైదరాబాద్ నుండి కూడా వచ్చి తమ మొక్కులు తీర్చు కుంటారని తెలిపారు. ఈ ఉర్సు ఉత్సావాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దర్గా ముతవల్లి అబ్దుల్ రహీం కోరారు.

## దర్జాగా పొలాలకు..!

పెద్దపల్లి : పంట పొలాలకు వెళ్లడానికి రోడ్డు సరిగ్గా లేక ఇన్నాళ్లు రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎరువులు, విత్తనాలు, పంట ఉత్పత్తులు తరలించడానికి నానా తంటాలు పడేవారు. వర్షాకాలంలో అయితే ఈ బాధ వర్ణణాతీతం. పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ సమస్యలు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పొలాలకు వెళ్లే మట్టి రహదారులకు మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. ఉపాధిహామీ పథకంలో భాగంగా వీటిని చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.9.22 కోట్లతో 168 కి.మీ పొడవు మేర రహదారుల పనులు మొదలయ్యాయి. 168 కి.మీ మేర..

గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లడానికి ఎక్కువగా మట్టి దారులే ఉన్నాయి. కొన్ని దారుల్లో ఎడ్ల బండ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 168 కి.మీ మేర ఇలాంటి రోడ్లను గుర్తించిన అధికారులు బాగు చేసేందుకు రూ.9.22 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం కాలినడకన ఉన్న బాటలను ఫార్మేషన్ రోడ్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి కూలీలు ఇరువైపులా కందకం తవ్వి.. ఆ మట్టిని రోడ్డుపై పోస్తున్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత మొరం వేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి 60 కి.మీ మేర పనులు చేయాలని మొదట భావించినా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 168 కి.మీ పనులకే పరిమితమయ్యారు.

**మార్చిలోపు గడువు**

రోడ్డు పనులు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాల్సి ఉంది. మార్చిలోపు పూర్తి చేసేందుకు అధికారులు పనుల్లో వేగం పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో యాసంగి వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది. ఇలాంటి సమస్యలు అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే.. నాసిరకంగా పనులు చేయకుండా పర్యవేక్షణ చేస్తున్నారు. పనులు జరిగే సమీప పొలాల్లోని రైతుల అభిప్రాయాలు సేకరిస్తూ ముందుకు వెళ్తున్నారు.

**నాణ్యత లోపాలు లేకుండా ఆదేశాలు ఇచ్చాం**

**కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి**

రైతుల పంట పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎంపిక చేసిన పనులను ప్రారంభించి.. మార్చిలోపు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. పనుల ప్రగతిపై పర్యవేక్షిస్తున్నాం. పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించాం.

## భూగర్భ గనులు కనుమరుగు

గోదావరిఖని: సింగరేణిలో భూగర్భ బొగ్గు గనుల స్థానంలో ఉపరితల గనులను ఏర్పాటు చేస్తున్నారు. అత్యధిక మానవశక్తిని వినియోగించి బొగ్గు ఉత్పత్తి చేసిన భూగర్భ గనులు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో ఉపరితల గనులను ఏర్పాటు చేసి బొగ్గు ఉత్పత్తి చేపడుతున్నారు. గతంలో 56 భూగర్భ గనులుండగా ప్రస్తుతం 21కి చేరుకున్నాయి. రానున్న కాలంలో వీటి సంఖ్య మరింత తగ్గే పరిస్థితి కనిపిస్తోంది. భూగర్భ గనుల కంటే ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా చేపట్టే అవకాశం ఉండటంతో యాజమాన్యం ఆదిశగా చర్యలు తీసుకుంది. దీంతో పాటు కొత్త గనుల ఏర్పాటుకు కేంద్రం కొత్త చట్టం తీసుకురావడంతో ఉన్న వాటినే సర్దుకుంటూ బొగ్గు ఉత్పత్తి చేపట్టే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. కొత్త గనులు ఏర్పాటు చేయాలంటే వేలంలో పాల్గొనాల్సిందే. ఇటీవలే సింగరేణి ప్రాంతాల్లో ఉన్న నాలుగు గనులకు కేంద్ర ప్రభుత్వం వేలం నిర్వహించింది. అందులో రెండు గనులను ప్రైవేటు సంస్థలు దక్కించుకున్నాయి. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోవడం వల్ల బయటి వారి చేతుల్లోకి వెళ్లాయి. ఎలాంటి వేలం లేకుండా సింగరేణికి గనులు కేటాయించాలని కోరుతున్నప్పటికీ ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

**ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు**

సింగరేణి వ్యాప్తంగా 35 భూగర్భ గనులు కనిపించకుండా పోయాయి. తాజాగా బెల్లంపల్లి ఏరియాలోని శాంతిఖని గనిని కూడా ఉపరితల గనిగా మార్చేందుకు యాజమాన్యం ప్రణాళికలు చేసింది. రామగుండం రీజియన్‌లో జీడీకే-5, 5-ఎ, 6, 6-ఎ, 6-బి, 7, 7-ఎ, 8, 8-ఎ, 9, 10, 10-ఎ భూగర్భ గనులు లేకుండా పోయాయి. వాటి స్థానంలో ఓసీపీ-1, 2, 3, 5లుగా విస్తరించాయి. భూగర్భ బొగ్గుగనుల్లో మిగిలిపోయిన నిక్షేపాలను పూర్తిస్థాయిలో వెలికి తీసేందుకు ఉపరితల గనులతోనే సాధ్యమవుతుందని భావిస్తున్న సింగరేణి ఆదిశగా చర్యలు తీసుకుంది. బెల్లంపల్లి రీజియన్‌లోని గోలేటి, మాదారం, కేకే-1, ఆర్కే-1-ఎ, ఆర్కే-8, ఎస్ఆర్పీ-2, ఆర్కే-5 బి, ఆర్కే-5, 6, 7, న్యూటెక్ గనులు భవిష్యత్తులో ఉపరితల గనిగా మారే అవకాశం ఉంది. కొత్తగూడెంలో వీకే-7, ఇల్లెందులో 21 ఇంక్లైన్‌లను మూసివేసి దాని స్థానంలో ఉపరితల గనిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కొత్తగా మరికొన్ని గనుల స్థానంలో ఉపరితల గనులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

**ఉత్పత్తి చేపట్టే దిశగా..**

అపారమైన బొగ్గు నిక్షేపాలున్నప్పటికీ కొత్త గనులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో యాజమాన్యం విస్తరణ ప్రాజెక్టుల కింద ఉపరితల గనులను ఏర్పాటు చేస్తోంది. దీని వల్ల కొత్తగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. పాత గని కింద మాత్రమే దీనిని గుర్తిస్తారు. పర్యావరణ, ప్రాజెక్టు అనుమతులకు పెద్దగా ఇబ్బంది పడాల్సిన అవసరం లేకపోవడంతో యాజమాన్యం ఆదిశగా చర్యలు తీసుకుంటోంది. సింగరేణి సంస్థ కొత్త గనుల కోసం ప్రాజెక్టు నివేదికలు తయారు చేసుకుంది. వాటిని ఏర్పాటు చేసుకోవాలంటే కేంద్రం తీసుకువచ్చిన చట్టం ఎంఎండీఆర్(మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్) చట్టం ప్రకారం తప్పనిసరిగా వేలంలో పాల్గొంటేనే కొత్త గనులు దక్కించుకోవచ్చు. సింగరేణి విస్తరించి ఉన్న పూర్వ నాలుగు జిల్లాల్లోని గోదావరి పరివాహక ప్రాంతంలో అపారమైన బొగ్గు నిక్షేపాలున్నాయి. వీటిని వెలికి తీసేందుకు సింగరేణి సంస్థ రాంపూర్, పునుకుడుచిలక, తాడిచెర్ల-2, చంద్రుపల్లి, ములుగు తదితర గనులను ప్రణాళిక చేసుకుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వాటిని ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంతో విస్తరణ ప్రాజెక్టులపైనే దృష్టి సారించింది.

## సమయం మిగులుతోంది మిత్రమా

చేగుంట: వ్యవసాయంలో ఆధునిక యంత్రాలది పైచేయి అవుతోంది. ఒకప్పుడు ఎడ్లు, నాగళ్లు, కూలీలతోనే పూర్తిస్థాయిలో వ్యవసాయం చేసేవారు. సాగు విధానాల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. యంత్ర పరికరాలను వాడుతున్నారు. ఎండాకాలంలో, చలికాలంలో వానలు, వానకాలంలో ఉక్కపోత లాంటివి సంభవిస్తుండటంతో అదును దాటకుండా సాగు పనులు చేసుకోవడానికి యంత్ర పరికరాలు ఉపయోగపడుతున్నాయి. దిగుబడులూ పెరుగుతున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కొందరు రైతులు కొనుక్కుంటున్నారు. మరికొందరు యంత్రాలను కిరాయికి తెచ్చి వాడుతున్నారు. ఒకరోజు మొత్తం చేసే పని.. కొద్ది గంటలల్లో పూర్తవుతోంది. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని ఎక్కువ గ్రామాల్లో యాంత్రీకరణ ఫలం వ్యవసాయంలో కనిపిస్తోంది. నాట్లు వేయటం, కలుపు తీయటం మాత్రం కూలీలతో ఇంకా చేయిస్తున్నారు. కొద్ది మందే యంత్రాలతో నాటేస్తున్నారు. ట్రాక్టర్లు ప్రతి గ్రామంలో పది, ఆపైన ఉన్నాయి. క్రిమిసంహారక మందులు పిచికారి చేసే యంత్రాలు వ్యవసాయం చేసే ప్రతి రైతు వద్ద ఉన్నాయి. ప్యాడీ హార్వెస్టర్: వరి కోయటానికి ఉపయోగిస్తారు. ఎకరం కోయాలంటే ఒక గంట సమయం పడుతుంది. సాధారణ పద్ధతిలో 6 గంటలు.

**కేజ్‌వీల్స్:** వరి పొలంలో దుక్కి, దమ్ము చేస్తుంది. ఎకరం పొలాన్ని గంటలో పూర్తి చేస్తుంది. సాధారణ నాగలితో 4 గంటలు పడుతుంది.

**రోటావేటర్:** ట్రాక్టర్ సహాయంతో దుక్కి దున్నొచ్చు. దమ్ము చేస్తారు. ఒక గంటలో ఎకరం పొలంలో పని పూర్తి చేస్తుంది. సాధారణ నాగలితో 6 గంటలవుతుంది.

**డ్రోన్:** పొలంలో రసాయనిక మందులు పిచికారీ చేయటానికి ఉపయోగపడుతుంది. ఎకరం విస్తీర్ణంలో చేయటానికి 15 నిమిషాలు అవుతుంది. ఒక వ్యక్తికి గంట సమయం పడుతుంది.



**ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్:** ట్రాక్టర్ సహాయంతో నడుస్తుంది. పత్తి పంటలో పయోగిస్తారు. ఒక గంటలో 2 నుంచి 3 ఎకరాలు పిచికారీ చేస్తుంది. ఒక వ్యక్తి చేస్తే మాత్రం 4 గంటలు.

**ట్రాక్టర్ మౌంటెడ్ కల్టివేటర్:** పొలంలో దుక్కి చేసేందుకు ఉపయోగిస్తారు. గంటలో 2 ఎకరాల దుక్కి చేస్తుంది. పాత పద్ధతిలో 5 గంటల కాలం.

**ట్రాక్టర్ డ్రాన్ ప్లఫ్:** దుక్కి చేస్తుంది. నేలలోని మట్టిని పైకి .. పైమట్టిని లోపలికి ఒక గంటలో తిరగబెడుతుంది. ఎడ్లతో నడిచే నాగలికి 6 గంటలు.

మొక్కజొన్న తొలిచే యంత్రం: ఒక గంటలో 45 క్వింటాళ్లు వలుస్తుంది. చేతితో చేపడితే 4 రోజులు.

**పవర్ వీడర్స్:** ఒక ఎకరానికి 2 గంటలు పడుతుంది. మనుషులతో చేయిస్తే 6 గంటల సమయం అవుతుంది

విత్తనాలు, ఎరువులు వేయడానికి: ఒక గంటలో ఎకరా పొలంలో విత్తనం, ఎరువులను వేస్తుంది. మామూలు పద్ధతిలో 6 గంటల సమయం పడుతుంది.

**వేగంగా నాట్లు వేసేందుకు.. :** దీనిని పొలంలో నాట్లు వేసేందుకు ఉపయోగిస్తారు. ఎకరా పొలంలో 2 గంటల్లో నాట్లు వేస్తుంది. మనుషులతో 5 గంటలు అవుతుంది.

**గడ్డి చుట్టి.. కట్ట కట్టి..:** వరి గడ్డిని కట్టలుగా చుడుతుంది. ఒక గంటలో ఎకరంలో చుట్టి వేస్తుంది. పాత పద్ధతిలో 7 గంటలు.

## కదలని క్రమబద్ధీకరణ

సిద్దిపేట : జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యూలరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. ఇందుకోసం నియమించిన కమిటీలు నివేదికలు ఇవ్వడంలో జాప్యం కారణంగా పరిశీలన ప్రక్రియ ఆలస్యమవుతోందని విమర్శలున్నాయి. సంక్రాంతి దాటితే ఇళ్ల నిర్మాణాలకు ముహూర్తాలుంటాయని, ఆలోపు అనుమతులు వస్తే నిర్మాణాలు ప్రారంభించుకునేందుకు అనువుగా ఉంటుందని దరఖాస్తుదారులు చెబుతున్నారు. అనుమతులు లేని వెంచర్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేసి నిర్మాణాలకు దూరమైన ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు అనుమతిచ్చింది. ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో ఎల్ఆర్ఎస్ విషయం మరోమారు తెరపైకి వచ్చింది. దరఖాస్తులను క్రమబద్ధీకరించేందుకు



ప్రభుత్వం గత అక్టోబరులో కమిటీలు వేసింది. జిల్లాలో 549 మందితో 29 కమిటీలు ఏర్పాటయ్యాయి.

**ఇప్పటి వరకు 35 శాతమే**

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 35 శాతం వరకే ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 11548 దరఖాస్తులు రాగా 3 వేల వరకు పరిశీలించారు. సంబంధీకులకు సందేశాలు పంపించారు. ఇందులో 60 మంది వరకు ఫీజు చెల్లించినట్లు సమాచారం.

**పరిశీలనకు ప్రత్యేక యాప్**

నవంబరు 2020 వరకు జిలా వ్యాప్తంగా సుమారు 80 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలనకు ప్రత్యేక యాప్ తయారు చేశారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, టౌన్‌ప్లానింగ్ మూడు లాగిన్లు ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తుకు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న యజమానికి సంబంధం లేకపోవడం వంటి విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చరవాణి నంబర్లు మనుగడలో లేకపోవడం, స్థలాల హద్దులు సరిగా లేక ఇబ్బందిగా మారుతోందని అధికారులు చెబుతున్నారు.

